క్లుప్తంగా

4న జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాస్థాయి నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4న స్థానిక ఎస్ఆర్‌ప్రైమ్ పాఠశాలలో సబ్ జూనియర్స్ బాలబాలికల నెట్‌బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లేశ్, గౌతమ్ ప్రకటనలో తెలిపారు. 1 నవంబర్ 2024 వరకు 16 సంవత్సరాల వయస్సుకు లోబడి ఉండాలన్నారు. సంబంధిత వయస్సు ధ్రువీకరణ పత్రం, బోనాఫైడ్, బర్త్ సర్టిఫికెట్‌లతో ఈనెల 4న ఉదయం 10గంటలకు పోటీల కన్వీనర్, పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, పోటీల ఆర్గనైజర్లు గౌతమ్, హరీశ్‌లకు రిపోర్ట్ చేయాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10 వరకు నిర్మల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ప్రతీ గ్రాడ్యుయేట్ ఓటు నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న పడాల రవీందర్

ఎదులాపురం: జిల్లాలో లక్షల మంది గ్రాడ్యుయేట్లు ఉన్నప్పటికీ నేటికి 15వేల ఓట్లు కూడా నమోదు కాకపోవడం విచారకరమని, ఓటు నమోదులో నిర్లక్ష్యం వీడి ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం అధికార ప్రతినిధి, సీఆర్పీఏ టీజీ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి పడాల రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

మావలలోని ప్రభుత్వ పాఠశాలలో చోరీ


చిందరవందరగా పడేసి ఉన్న బోర్డులు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని మావల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల2లో చోరీ జరిగింది. ఎస్సై విష్ణు వర్ధన్ కథనం ప్రకారం.. గత నెల 29 నుంచి పాఠశాలకు వరుసగా మూడు రోజులు సెలవులు ఉండడంతో పాఠశాలకు తాళం వేసి ఉంచారు. శనివారం ఉదయం పాఠశాల సమయానికి వచ్చి గమనించే సరికి పాఠశాల డోర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పాఠశాలలోని 12 ఫ్యాన్లు, క్వింటాల్‌న్నర బియ్యం, తాగునీటి నల్లాలు పగుల గొట్టి ఎత్తుకెళ్లారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దేవాపూర్ మహంకాళి ఆలయానికి మైక్‌సెట్ అందజేత


మైక్‌సెట్ అందజేస్తున్న మౌనిష్ రెడ్డి

తలమడుగు: మండలంలోని దేవాపూర్ గ్రామంలో గల మహంకాళి ఆలయం కోసం ముడుపు మౌనిష్ రెడ్డి, ముడుపు కేదారేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులకు రూ. 20వేల విలువ గల మైక్‌సెట్‌ను శనివారం విరాళంగా అందజేశారు.

డైట్‌చార్జీల పెంపుపై విద్యార్థుల హర్షం


హర్షం వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

ఇంద్రవెల్లి/నేరడిగొండ/ ఉట్నూర్‌రూరల్/ ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ వసతిగృహాలకు డైట్, కాస్మొటిక్ చార్జీలు పెంచడంపై జిల్లాలోని పలు మండలాల్లో వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

కేజీబీవీ భవనం ప్రారంభమెప్పుడో?

- అద్దె భవనంలో అవస్థలు పడుతున్న విద్యార్థినులు
- సొంత భవన నిర్మాణం పూర్తి
- విద్యుత్ సౌకర్యం లేక ప్రారంభంలో జాప్యం
- పట్టించుకోని అధికారులు


భీంపూర్‌లో పూర్తయిన కేజీబీవీ నూతన భవనం

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలోని కేజీబీవీ భవన నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి మోక్షం కలగడం లేదు. ఏళ్లుగా అద్దె భవనాల్లో ఉంటూ విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నాలుగేళ్ల క్రితం సొంత భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా నేటికీ భవనాన్ని అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో అద్దె భవనాల్లోనే అసౌకర్యాల నడుమ విద్యార్థినులు కాలం వెళ్లదీస్తున్నారు.

నాలుగేళ్ల క్రితం నిధులు మంజూరు..

నూతన మండలంగా ఏర్పడిన భీంపూర్ మండలానికి గత ప్రభుత్వం 2015లో కేజీబీవీని మంజూరు చేసింది. అప్పటి నుంచి జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలతో పాటు అద్దె భవనంలో కేజీబీవీని కొనసాగిస్తున్నారు. అందులో 250మందికి పైగా విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. సౌకర్యాలు సరిగా లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థినుల తిప్పలు గుర్తించిన ప్రభుత్వం సొంత భవన నిర్మాణం కోసం నాలుగేళ్ల క్రితం రూ.3.5 కోట్లను మంజూరు చేసింది. నాలుగేళ్ల పాటు ఆగుతూ.. సాగుతూ కొనసాగిన భవన నిర్మాణ పనులు ఎట్టకేలకు ఇటీవల పూర్తయ్యాయి. భవన నిర్మాణం పూర్తి చేసి నెలలు గడుస్తున్నా విద్యుత్ సరఫరా లేక భవనాన్ని ప్రారంభించడం లేదు.

విద్యుత్ సరఫరా లేక..

రూ.కోట్లతో నిర్మించిన భవనానికి విద్యుత్ సరఫరా చేయడంలో సంబంధిత అధికారులు జాప్యం చేస్తున్నారు. నూతన భవనం పూర్తయినా నిరుపయోగంగా మారడంపై మండలవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో సొంత భవన నిర్మాణ కోసం ప్రభుత్వం గతంలో నిధులు మంజూరు చేయడంతో భవన నిర్మాణం త్వరగా పూర్తయితే అవస్థలు తప్పుతాయని భావించారు. గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా మూడేళ్లకు పైగా పనులు కొనసాగాయి. ఎట్టకేలకు భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కానీ విద్యుత్ సరఫరా లేక ప్రారంభానికి నోచుకోవడం లేదు. కేజీబీవీకి ప్రత్యేక విద్యుత్ సరఫరా లైన్‌తో పాటు ట్రాన్స్‌ఫార్మర్ కోసం రూ.9.9లక్షల డీడీ సైతం చెల్లించారు. డీడీ చెల్లించి నాలుగు నెలలు అవుతున్నా నేటికీ విద్యుత్ శాఖ అధికారులు నూతన భవనానికి విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు చేయడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నూతన కేజీబీవీ భవనానికి విద్యుత్ సరఫరా చేసి భవనాన్ని ప్రారంభించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం

భీంపూర్ మండల కేంద్రంలో నిర్మిస్తున్న కేజీబీవీ భవన నిర్మాణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన చిన్నచిన్న పనులను సైతం పూర్తి చేయిస్తున్నాం. విద్యుత్ సరఫరాతో పాటు సెప్టిక్ ట్యాంక్ నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. విద్యుత్ సరఫరా కోసం సంబంధిత శాఖ అధికారులకు తెలియజేశాం. ఇప్పటికే విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. త్వరలోనే కేజీబీవీ భవనానికి విద్యుత్ సరఫరా ఇచ్చి అందుబాటులోకి తీసుకొచ్చి భవనాన్ని అప్పగిస్తాం.

– సుమంత్, ఏఈ, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ

కెనాల్ పూడికతీసి రైతులకు సాగునీరందించాలి


డీఈ శ్రీనివాస్‌కు సమస్య వివరిస్తున్న రూపేష్ రెడ్డి

కైలాస్‌నగర్: జైనథ్ మండలం లక్ష్మీపూర్ రిజర్వాయర్ నుంచి వెళ్లే కెనాల్ పూడికను తొలగించి చివరి ఆయకట్టు రైతులకు సాగునీరందించేలా చూడాలని యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి కోరారు. శనివారం సాత్నాల ప్రాజెక్ట్ డీఈ శ్రీనివాస్‌ను కలిసి రైతుల సమస్యను వివరించారు. కెనాల్‌లోని పూడిక పేరుకుపోవడంతో మండలంలోని బెల్గాము, బెల్లూరి, మాకోడ, కాప్రి, ఉమ్రి గ్రామ రైతులకు చివరి వరకు నీళ్లు వెళ్లలేని పరిస్థితి ఉందని తెలిపారు. దీంతో యాసంగిలో సాగు చేసే శనగ పంటకు నీరు అందడం లేదన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన డీఈ రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో కొలబోడి పూజలు


బోథ్: పార్డికె గ్రామంలో పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీలు

బోథ్: దండారీ ఉత్సవాలు ముగియడంతో ఆదివాసీ పల్లెల్లో శనివారం కొలబోడి పూజలు నిర్వహించారు. మండలంలోని పార్డికె గ్రామంలో మహిళలు హారతులతో గుస్సాడీ టోపి, పర్ర, వెట్టి, కోడల్, తుడుమ్‌లకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్ సిడాం అమృత్‌రావ్, దేవరి, జయతు, ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మేస్రం భూమన్న, మహజన్ మదన్‌రావ్, నవీన్, శ్రీనివాస్, సురేష్, సాగర్, దశరథ్, భీంరావ్, శివాజీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: దండారీ ఉత్సవాల్లో భాగంగా కొలాబోడి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా జరుపుకున్నారు. పందిర్‌లొద్దీ గ్రామంలో రేలాపాట పాడుతూ సంప్రదాయ దుస్తువులు ధరించి మహిళలు గుస్సాడీలకు హారతులు ఇచ్చారు.

‘జాతి ప్రయోజనమే ఏఐబీఎస్ఎస్ లక్ష్యం’


కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం నాయకులు

నార్నూర్: జాతి ప్రయోజనమే లక్ష్యంగా అఖిల భారతీయ బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్ఎస్) పని చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డి నాయక్ అన్నారు. శనివారం మండలంలోని రాజులగూడ వద్ద గల ఫంక్షన్ హాల్‌లో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంఘం జిల్లా నాయకులు, ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, రాథోడ్ ప్రవీణ్‌లు వ్యవహరించారు. మండల అధ్యక్షుడిగా జాదవ్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ దిలీప్, ఉపాధ్యక్షులుగా తాక్రు నాయక్, జాదవ్ జైపాల్‌సింగ్, సహాయ కార్యదర్శిగా రాథోడ్ రమేశ్, పవర్ భరప్ సింగ్, ట్రెజరీగా రాథోడ్ గణేశ్, జాదవ్ రాహుల్, మీడియా ఇన్‌చార్జీగా జాదవ్ రోహిదాస్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భూగర్భ జలాల మట్టం పెరిగేలా చూడాలి


ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారి శ్రీవల్లి

తాంసి: భూగర్భ జలాల నీటిమట్టం పెరిగే విధంగా నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా భూగర్భ జల నిర్వహణ అధికారి శ్రీవల్లి ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం భీంపూర్ మండలంలోని రాజ్‌ఘడ్ గ్రామంలో డ్రీమ్స్ స్వచ్ఛంద సంస్థ సౌజన్యంతో భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో భూగర్భ జలాల నిర్వహణ, నీటిమట్టం పెంపుపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామస్తులచే నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అధికారి శ్రీవల్లి మాట్లాడుతూ నీటిని ఏవిధంగా పొదుపుగా వాడుకోవాలో, వాన నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణం చేసుకోవాలని సూచించారు. డ్రీమ్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ ఉయికే లక్ష్మణ్, మాజీ సర్పంచ్ చిన్ను, గ్రామపటేల్ మడావి భీంరావు ఉన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వే జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న కంది శ్రీనివాస్ రెడ్డి

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన, సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను జయప్రదం చేసేలా పార్టీ శ్రేణులు ప్రజల్లో అవగాహన కల్పించాలని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవభవనలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ముఖ్య నాయకులతో కులగణన సర్వేపై జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ దిగంబర్ రావు పాటిల్, కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఆశమ్మ, నాయకులు గిమ్మ సంతోష్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దీపావళి వేడుకలు


పశువులకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని మహారాష్ట్రకు సరిహద్దుగా పెన్‌గంగ నదిని ఆనుకొని పలు గ్రామాల్లో శనివారం దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అర్లి(టి), అంతర్గాం, గోముత్రి, కరంజి(టి), గుబిడి పండుగ జరుపుకున్నారు. అర్లి(టి) గ్రామంలో గ్రామ రైతులు, పశుపోషకులు గోవుల మందకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం గ్రామంలోని బాలాజీ మందిర్ వద్ద పశువులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

డీఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు


డీఎస్పీని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డిని కాంగ్రెస్ నాయకులు శనివారం తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ సీనియర్ నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి ఆధ్వర్యంలో కలిసిన వారు శాలువాతో సత్కరించారు. పూలమొక్కను అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానించిన వారిలో కౌన్సిలర్ కలాల్ శ్రీనివాస్, నాయకులు ఇమ్రాన్, రోహిత్ షిండే, సోమ ప్రశాంత్, మాదాసు భూపేందర్, మనే శేఖర్ ఉన్నారు.

ధర్నా జయప్రదం చేయండి

ఎదులాపురం: ఆటో, మోటర్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆటో, మోటర్ వర్కర్స్ జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఈ నెల 5న చేపడుతున్న ధర్నా విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆటో, మోటర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దళిత్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కుమురం భీమ్ భవనంలో శనివారం మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఆటో కార్మికులు వినోద్, ఉమర్, మహమ్మద్ రాజు, రహబాజ్, నితిన్, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు టీయూటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ఎదులాపురం: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా కార్యవర్గ పదవీకాలం తీరినందున నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో ఆదివారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు తెలిపారు. టీయూటీఎఫ్ ప్రాథమిక సభ్యులు, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కలెక్టర్ ఆదేశాల తర్వాతే విగ్రహాల ఏర్పాటు

ఇచ్చోడ: మండల కేంద్రంలో రోడ్డు మధ్యలో ఏర్పాటు చేయనున్న విగ్రహాలు జిల్లా కలెక్టర్ ఆదేశాల తర్వాతే ఏర్పాటు చేసుకోవాలని ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో బజార్‌హత్నూర్ చౌరస్తాలో ఇటీవల కాలంలో కుమురంభీం, అంబేద్కర్, సేవాలాల్ విగ్రహాల ఏర్పాటు కోసం రోడ్డు మధ్యలో జెండాలు పాతారు. విగ్రహాల ఏర్పాటులో మూడు వర్గాల మధ్య వివాదం మొదలైంది. శనివారం ఆర్డీవో వినోద్‌కుమార్ తహసీల్దార్ కార్యాలయంలో మూడు వర్గాల నాయకులతో చర్చలు జరిపారు. మూడు వర్గాలకు చెందిన జెండాల తొలగింపునకు వారు ఒప్పుకున్నారన్నారు. రోడ్డు పనులు పూర్తయిన తర్వాత కలెక్టర్ ఆధ్వర్యంలో నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ సత్యానారాయణరావు, సీఐ భీమేశ్, ఎంపీడీవో లక్ష్మణ్, డీటీ రమేశ్, ఆర్ఐ హుస్సేన్, ఆర్అండ్‌బీ ఏఈ అరవింద్ పాల్గొన్నారు.

రిమ్స్ సమస్యలు పరిష్కరించాలని వినతి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి కోరారు. శనివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రిమ్స్ కార్మికులకు కనీస వేతనాలను చెల్లించాలని కోరారు. గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన లిఫ్ట్‌కు మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని దర్మంపురిగూడలో శనివారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి గోవింద్‌నాయక్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో పశువైద్యశాఖ తరఫున ఉచితంగా పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. టీకాలు వేయడం వల్ల రానున్న రోజుల్లో పశువులకు గాలి కుంటు వ్యాధి సోకకుండా ఉంటుందని పేర్కొన్నారు.

దండారీ చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

నార్నూర్: మండలంలోని మాన్కాపూర్ గ్రామంలో దండారీలకు ప్రభుత్వం అందజేస్తున్న రూ.15వేల చెక్కులను రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు పటేల్, ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరం యువతకు అందించేందుకు రాయిసెంటర్, ఆదివాసీ జేఏసీలు కృషి చేస్తున్నాయన్నారు. మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తొడసం నాగోరావ్, జాదవ్ రాజేశ్వర్, రూప్‌దేవ్, బాధిరావు, రమేశ, చందు ఉన్నారు.

పీఏసీఎస్‌ల ద్వారా శనగ విత్తనాల విక్రయం


సమావేశంలో మాట్లాడుతున్న అన్వేశ్ రెడ్డి

కైలాస్‌నగర్: రైతులకు తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నాణ్యమైన శనగ విత్తనాలను అందజేస్తున్నట్లు సంస్థ చైర్మన్ సుంకెట అన్వేశ్ రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల పీఏసీఎస్ అధికారులు, డీలర్లు, మండల వ్యవసాయ అధికారులతో విత్తనాల మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీడ్ కార్పొరేషన్‌ను బలోపేతం చేయడంతో పాటు రైతులకు అండగా నిలిచేలా విత్తనాలను అందజేస్తున్నట్లు తెలిపారు. టీజీ -11, జాకీ, ఎన్‌బీఈజీ -3 రకాలకు చెందిన 10వేల క్వింటాళ్ల శనగ విత్తనాలను జిల్లాకు కేటాయించామన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా కిలోకు రూ.90 చొప్పున 25 కేజీల బ్యాగుల్లో విక్రయించనున్నట్లు పేర్కొన్నారు. సీడ్ కార్పొరేషన్ ద్వారా అందించే విత్తనాలను రైతులు కొనుగోలు చేసేలా ఆయా విభాగాల అధికారులు విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, డీఏవో శ్రీధర్ స్వామి, డీసీవో మోహన్ పాల్గొన్నారు.

గోండ్ గోవారీల సమస్యల పరిష్కారానికి కృషి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గోండ్‌గోవారీలు

బేల: గోండ్‌గోవారీల సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పోనాల, దేవ్‌జీగూడ, చంపెల్లి, తదితర గ్రామాల్లో ఆదివాసీలతో కలిసి దండారీ ఉత్సవాల్లో పాల్గొని, వాయిద్యాలకు ప్రత్యేక పూజలు చేశారు. పోనాలలో గోండ్‌గోవారీలు తమ కులానికి గుర్తింపు లేదని, ఎస్టీ జాబితాలో చేర్పించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. గోవారీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జానాజీ, గోండ్వానా గణతంత్ర పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కొరంగే దౌలత్ పటేల్, బీజేపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్‌లతో సీఐ సాయినాథ్

బేల: మండలంలోని కాంఘర్‌పూర్ రెవెన్యూ గ్రామ శివారులో శనివారం సాయంత్రం జైనథ్ సర్కిల్ సీఐ సాయినాథ్ ఆధ్వర్యంలో ఎస్సై రాధిక, ఆర్ఐ అశోక్, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ రమేశ్ పవార్‌లు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి, మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమ ఇసుక రవాణా జరగకుండా పెన్‌గంగ నుంచి బయటకు వచ్చే దారిలో కందకం తవ్వించారు.

ఒకరిపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: డబ్బుల విషయంలో ఒకరిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన గంగాధర్‌తో క్రాంతినగర్‌కు చెందిన రవితేజ డబ్బుల విషయంలో గొడవ పడటమే కాకుండా దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడి వివరాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులపై ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఉట్నూర్ మండలకేంద్రంలోని తిరుమల ఫంక్షన్ హాల్‌లో ట్రస్మా ప్రైవేటు పాఠశాల యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేస్తుందన్నారు.

డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన


ఆందోళన చేస్తున్న యాదవ కులస్తులు

కైలాస్‌నగర్: డీఎస్సీ -2024 నియామకాల్లో భాగంగా డీఈవో కార్యాలయంలో అక్రమాలు జరిగాయని, అనర్హులకు పోస్టింగ్ ఇచ్చి విధుల్లో చేరిన అభ్యర్థులకు అన్యాయం చేశారని యాదవ సంఘం నాయకులు ఆరోపించారు. శనివారం సంఘం ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ తలమడుగు మండలం కుచులాపూర్‌లో ఉపాధ్యాయుడిగా నియామకమైన నవీన్ యాదవ్‌ను రోస్టర్‌లో దొర్లిన పొరపాటుతో సర్వీసు నుంచి తొలగిస్తున్నట్లుగా తమకు సమాచారం అందిందన్నారు. దీనిపై న్యాయం చేయాలని కోరుతూ డీఈవో ప్రణీతకు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ రాజర్షిషాను కలిసి అక్రమాలపై విచా రణ జరిపించాలని కోరారు. నాయకులు హన్మండ్లు, నారాయణ , రామన్న , ప్రఫుల్, దేవారెడ్డి, రవికాంత్, కృష్ణ పాల్గొన్నారు.